సాక్షి ఒడిశా

సోమవారం । 17 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,02,524లు, బంగారం 35గ్రాములు, వెండి 40.9 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మృత్యు ద్వారాలు!

● కటక్‌లో మురుగు కాలువలో పడి యువకుడి మృతి

- 8లో.



మర్యాద పూర్వకంగా..

- 8లో.

న్యూస్‌రీల్

నేటి నుంచి చౌడేశ్వరి వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

బరంపురం: నగరంలోని మార్తేపేట వీధిలో రామలింగ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం 44వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో హోమం, సాముహిక కుంకుమార్చనలు, పంచామృత అభిషేకాలు, నిజరూప దర్శనం, అఖండ దీపారాధన, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరగనున్నట్లు ప్రకటించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

జోరుగా వాహన తనిఖీలు



కొమ్మపల్లి జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో గత కొద్ది రోజులుగా చోటు చేసుకుంటున్న వరుస దోపిడీ ఘటనలతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేసేందుకు నగర పోలీసులు నడుం బిగించారు. బరంపురం నగరంలోని వివిధ జంక్షన్లలో వచ్చి పోయే వాహనాలను ఆదివారం క్షుణ్ణంగా సోదా చేశారు. వాహన పత్రాలను పరిశీలించడంతో పాటు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. అలాగే మరోవైపు ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు బరంపురం జిల్లా పోలీసు యంత్రాగం నడుం బిగించింది. ప్రధాన జంక్షన్లయిన కొమ్మపల్లి, ఇంజినీరింగ్ జంక్షన్, పీవీఎన్ రావు పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో బీఎంసీ సహకారంతో ట్రాఫిక్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

నేడు చిత్తా అలంకార సేవ



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన జగన్నాథునికి చిత్తా(నుదుటి ఆభరణం) అలంకార సేవ సోమవారం జరగనుంది. శ్రావణ మాస అమావాస్య తిథి పురస్కరించుకుని ఈ సేవ చేయడం సంప్రదాయంగా పేర్కొన్నారు. ఈనెల 17న తొలి భోగమండప సేవ అనంతరం చిత్తా లగ్గి కార్యక్రమం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సాధారణ భక్తులకు సర్వదర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ఆలయ అధికార వర్గాలు వెల్లడించాయి.

మునిగుడ ఎస్‌డీపీఓగా సంతోషిణి ఓరం



సంతోషిణి ఓరం


రాయగడ: జిల్లాలోని మునిగుడ ఎస్‌డీపీఓగా సంతోషిణి ఓరం నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ఆకాష్ చంద్ర సాహు పదోన్నతిపై భువనేశ్వర్‌కు అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఓరం గతంలో బరంపురంలో పోలీస్ విభాగానికి చెందిన ఐయూసీడబ్ల్యూ డీఎస్పీగా విధులు నిర్వహిస్తుండేవారు. ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

అనుకూలించేనా!

సార్వత్రిక ఎన్నికలకు రాజకీయ సన్నాహాలు ఊపందుకున్నాయి. అధికార, విపక్షాలు ఎవరి తరహాలో వారు తమ వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పనలో తలమునకలై ఉన్నాయి. ఓటరును విశేషంగా ఆకట్టుకునేందుకు ఉభయ పక్షాలు ఆరాట పడుతున్నాయి. రాష్ట్రంలో అనుబంధ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నట్లు వదంతులు వినిపించడంతో ఊహాగానాలకు మరింత ఊతం దొరికింది.

– భువనేశ్వర్

- రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల ఊహాగానాలు
- అనుబంధ బడ్జెట్‌కు సంకేతాలతో మరింత ఊతం
- 5టీ కార్యదర్శి చుట్టూ అలముకున్న రాజకీయ వాతావరణం
- సై అంటే సై అంటున్న అధికార, ప్రతిపక్షాలు





రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశాల పట్ల రాజకీయ శిబిరాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ప్రధానంగా అధికార బిజూ జనతాదళ్, విపక్షం భారతీయ జనతా పార్టీల వైఖరి ఈ పరిస్థితిని బలోపేతం చేస్తోంది. ఈ రెండు పక్షాలు ఒకరి వైఖరి వేరొకరిని ముందస్తు ఎన్నికల సన్నాహాలకు సిద్ధం అవుతున్నట్లు ప్రేరేపిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నాయి. అధికార, విపక్షాల తరహాలో సార్వత్రిక ఎన్నికలు ఏ క్షణంలో జరిగిన తలపడేందుకు తాము సిద్ధమేనని రాష్ట్ర కాంగ్రెస్ చెబుతోంది. పలు ప్రజాకర్షిత పథకాలను నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ ప్రభుత్వం మెరుపు వేగంగా ప్రకటిస్తోంది. ఇదిలా ఉండగా తాజాగా ప్రకటించిన ప్రజాహిత పథకాల ప్రవేశం, అమలు, కార్యాచరణ పురస్కరించుకుని నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వం అనుబంధ బడ్జెట్ రూపకల్పన సన్నాహాలకు నడుం బిగించింది. ఈ చర్యలతో అధికార బిజూ జనతాదళ్ ఏ క్షణంలోనైనా ముందస్తు ఎన్నికలను ప్రకటించే అవకాశం ఉందని సర్వత్రా చర్చ బలం పుంజుకుంటోంది. ప్రస్తుత ప్రభుత్వ కాల పరిమితి 2024 మే వరకు ఉంది. అయితే ఈ ఏడాది డిసెంబర్ నెలలో దేశంలోని 5 రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలతో ముందస్తు ఎన్నికల పట్ల అధికార బీజేడీ ఉత్సాహం ప్రదర్శిస్తున్నట్లు భావిస్తున్నారు. దీంతో దాదాపు 6 నెలల ముందుగానే ఎన్నికలు జరిపించేందుకు కసరత్తు జరుగుతుందనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్ని రెచ్చగొడుతున్నాయి.

బీజేపీ తహతహ..

ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆయన పర్యటనలు రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రతిపక్షం బీజేపీ ఆయన పర్యటనలను ప్రజాస్వామ్య వ్యవస్థకు సిగ్గు చేటుగా ప్రచారం చేస్తోంది. మరోవైపు ప్రభుత్వ అధికారిగా నియమావళి ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో దాఖలైన ఫిర్యాదు పట్ల కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి విచారణ నివేదిక కోరింది. ముందస్తు ఎన్నికల దృష్ట్యా పాండ్యన్ ఆధ్వర్యంలో ప్రజాదరణ కూడగట్టుకునే ప్రయత్నాలు జరుగతున్నాయనేది విమర్శిస్తుంది. మోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం ముందస్తు ఎన్నికల కోసం తహతహలాడుతోంది. ఆకస్మిక ముందస్తు ఎన్నికలను ధీటుగా ఎదుర్కొనేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధమేనని పలువురు అధికార పక్షం నాయకులు సవాల్ చేస్తున్నారు. ప్రజా తీర్పు కోసం బీజేడీ అనుక్షణం నిరీక్షిస్తోందని ఈ వర్గం తెలిపింది.

బూత్ స్థాయిలో కసరత్తు..

ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ప్రవేశ పెట్టిన ప్రజాహిత పథకాల నుంచి రాష్ట్ర ప్రజలు పొందుతున్న లబ్ధి వివరించి, మనసు దోచుకునే లక్ష్యంతో బీజేడీ అడుగులు వేస్తోంది. రాష్ట్రశాఖ పార్టీ కార్యాలయంలో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అట్టడుగు స్థాయి కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయి కార్యకర్తల సమష్టి కృషిని బలోపేతం చేయడం ఈ సమావేశాల మౌలిక లక్ష్యంగా పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ జారీ కావచ్చు. ప్రతిక్షణం.. ఎన్నికల క్షణంగా పరిగణించి యుద్ధ ప్రాతిపదికన ప్రతిఒక్కరూ అంకిత భావంతో కృషి చేసి, అధికార పక్షం బీజేడీని గద్దె దించాలనే యోచనతో కమల దళం రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల అలజడితో అన్ని రాజకీయ పార్టీల సన్నద్ధత చూస్తుంటే ముమ్మందు పోరు హోరాహోరీగా ఉండనుందని తెలుస్తోంది.

బీజేడీ ఆరాటం..

రాష్ట్రంలో విపక్ష ధాటిని తాళలేని విపత్కర పరిస్థితుల్లో మంత్రిమండలి రద్దు చేసి, ముందస్తు ఎన్నికల కోసం అధికార పక్షం బిజూ జనతాదళ్ ఆరాటం కనిపిస్తోందని ప్రధాన ప్రతిపక్షం భారతీయ జనతా పార్టీ బహిరంగంగా తరచూ ఆరోపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కార్యదర్శి ఆధ్వర్యంలో ముమ్మరంగా సుడిగాలి పర్యటనలు మరోవైపు ఆకర్షణీయమైన ప్రజాహిత పథకాలకు కేబినెట్ ఆమోదంతో నిధులు సమకూర్చేందుకు సమయోచిత ప్రణాళికలు, సన్నాహాలు ముందస్తు ఎన్నికల కోసం బీజేడీ ఆరాట పడుతున్నట్లు అద్దం పడుతోందని బీజేపీ వ్యాఖ్యానిస్తోంది.

గ్రామీణుల వైపు గురి..

గ్రామీణ ఒడిశాలో దిగువ, మధ్య స్థాయి ఆదాయ కుటుంబాలను మంత్రిమండలి ఇటీవల ఆమోదించిన మో ఘురొ(నా ఇల్లు) గృహనిర్మాణ పథకం ప్రభావితం చేయనుంది. ఈ పథకం ప్రకటించిన కొద్ది రోజులకే రాష్ట్ర మంత్రిమండలి రూ.4వేల కోట్ల కేటాయింపుతో 'అమో ఒడిశా–నవీన ఒడిశా' పథకాన్ని ఆమోదించింది. ఈ పథకాల నిర్వహణకు వాస్తవ బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేసే దిశలో అనుబంధ బడ్జెట్ సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 31లోగా అన్ని శాఖలు పాలన, పలు కార్యక్రమాల ఖర్చు వివరాలను దాఖలు చేయాలని ఆర్థికశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం.. అనుబంధ బడ్జెట్ సన్నాహాలకు సంకేతంగా స్పష్టం అవుతోంది. రూ.4వేల కోట్ల కేటాయింపుతో ఇటీవల ఆమోదించిన 'అమో ఒడిశా–నవీన ఒడిశా' పథకానికి అనుబంధ బడ్జెట్‌లో పెద్దపీట వేసే అవకాశం ఉంది.

ఏకగ్రీవంగా ప్రైవేట్ బస్సు కార్యవర్గం



ప్రైవేట్ బస్సు యజమానుల తాత్కాలిక కార్యవర్గం

జయపురం: పట్టణానికి చెందిన ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆదివారం జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో సభ్యులంతా చర్చించి, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగా ప్రశాంతకుమార్ పాణిగ్రహి, కార్యవర్గ సభ్యులుగా మహేశ్వర బిశాయి, పవిత్రమోహణ పాత్రో, ఎస్.శంకరరావు, అశోక్‌కుమార్ మహాపాత్రో, విజయ సుబ్రహ్మణ్య పాత్రో లను నియమించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు 2 నిమినేషన్లు దాఖలు కాగా, వీటిని రద్దు చేయాలని కార్యవర్గం నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సుశాంత అధికారి, బసంతకుమార్ బిశ్వాల్, రామచంద్ర పాఢి ఎన్నికలను రద్దు చేసి, తాత్కాలిక కార్యవర్గాన్ని ప్రకటించారు. విజయ దశమి అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని తీర్మానించారు.

రాంనగర్ చర్చికి రూ.20 లక్షలు మంజూరు



చర్చిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

పర్లాకిమిడి: పట్టణంలోని రాంనగర్ ఒకటో వార్డులో ఉన్న ఉత్కళ బాప్టిస్టు మండలి చర్చికి ముఖ్యమంత్రి కార్యాలయం రూ.20 లక్షలు మంజూరు చేయడం ఆనందకరమని జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక చర్చిలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. క్రైస్తవ మందిర అభివృద్ధికి ప్రభుత్వ సహకారంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, టౌన్ అధ్యక్షుడు సుధీర్‌రంజన్ మహాపాత్రో, వార్డు కౌన్సిలర్ పి.అమ్ములమ్మ, చర్చి పర్యవేక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



మున్సిపల్ ఈఓతో మాట్లాతున్న వ్యాపారులు

రాయగడ: స్థానిక మున్సిపాలిటీలోని 15వ వార్డు పరిధి అశోకా టాకీస్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని, గత కొన్నేళ్లుగా వ్యాపారాలు కొనసాగిస్తున్న దుకాణాలను మున్సిపాలిటీ యంత్రాంగం తొలగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈఓ యాసిన్ బిలాల్ అహ్మద్ నేతృత్వంలో ఆదివారం భారీ పోలీసు బలగాలతో సన్నాహాలు ప్రారంభించారు. అయితే కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఆర్ధాంతరంగా దుకాణాలను తొలగిస్తే తమ పరిస్థితి ఏంటని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో దుకాణాలను తొలగిస్తే జీవనోపాధి కోల్పోతామని వారంతా వాపోయారు. అయితే స్థలాన్ని ఖాళీ చేయాల్సిందిగా పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, స్పందించక పోవడంతో చర్యలు చేపట్టామని ఈఓ తెలిపారు. దీంతో యంత్రాల సాయంతో కొన్ని దుకాణాలను తొలగించారు. మిగతా వారంతా వారం లోగా స్వచ్ఛందంగా తీసి వేయాలని, లేనిపక్షంలో ఇదే తరహా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. మున్సిపాలిటీ స్థలంలో మొత్తం 15 దుకాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



మున్సిపల్ ఈఓతో మాట్లాతున్న వ్యాపారులు

విషపూరిత పుట్టగొడుగులు తిని అస్వస్థతత

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు గిరిజనులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జయపురం: స్థానిక సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి బండిగుడ పంచాయతీ సరిగుడ గ్రామంలో విషపూరిత పుట్టగొడుగులు తిని, ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన కొందరు శనివారం సమీపంలోని అడవిలోకి వెళ్లి, పుట్టగొడుగులు తీసుకు వచ్చారు. వాటిని వండుకొని రాత్రి వండుకొని తిన్ని కొద్ది సేపటికే వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. గమనించిన గ్రామస్తులు అందరినీ బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు పద్మినీ శాంత, బైధి శాంత, పద్మ శాంత, పార్వతీ శాంత, జయంతి శాంత, పూర్ణ శాంతగా ఆస్పత్రి వర్గాలు ఆదివారం వెల్లడించాయి. చికిత్స అనంతరం అంతా కోలుకున్నారని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎటువంటి పుట్టగొడుగులు తినాలో సరైన అవగాహన లేకపోవడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో చైతన్యం కలిగించేందుకు బండిగుడ పంచాయతీకి ప్రత్యేక బృందాన్ని పంపించామని బొరిగుమ్మ ఆస్పత్రి అధికారి డాక్టర్ హరప్రసాద్ పాణిగ్రహి తెలిపారు.

వర్షాకాల సన్నద్ధత సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సమితి అధికారి రజనీకాంత నాయక్

జయపురం: వర్షాల సీజన్‌లో సంభవించే ప్రజల ధన, ప్రాణ నష్టాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జయపురం సమితి కల్యాణ అధికారి రజనీకాంత నాయక్ తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో వర్షకాల సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో అపరిశుభ్ర వాతావరణంలో డయోరియా, మలేరియా, డెంగీ తదిర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. వీటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వైద్య విభాగం తగు చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి కాలువలు ఉన్న కెనాల్ ప్రాంతాల్లో నివసించే ప్రజలు కాచి, చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. అలాగే తాగునీటి వనరులు, బావుల వద్ద క్లోరినేషన్ చేపట్టాలని, మరమ్మతులకు గురైన బోర్లను యుద్ధ ప్రాతాపదిన బాగు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, వాటి వంటగదులు, పశువుల శాలలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జయపురం బీడీఓ రాజీవ్ దాస్, రామనగుడ ప్రాథమిక వైద్యకేంద్రం అధికారి డాక్టర్ ఎ.చైతన్య, అదనపు బీడీఓ మనోజ్‌కుమార్ నాయక్, సమితి సంక్షేమ అధికారి కేఎస్ నిశా, జీపీఈఓ ప్రశాంత మిశ్రా, సీడీపీఓ సుచిత పండా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గుప్తేశ్వర్ భక్తులకు సౌకర్యాలు

- శ్రావణ సోమవారం నేపథ్యంలో భోల్‌భం దీక్షల సందడి



కావడితో చిన్నారి దీక్షధారులు

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌కు భక్తులు తండోప తండాలుగా వస్తున్నారు. ఒడిశా నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వడివడి చేరుకుంటున్నారు. శ్రావణ మాసం రెండో సోమవారం నేపథ్యంలో భోల్‌భం దీక్షలు చేపట్టిన వారంతా కాలి నడకన వచ్చి, రాత్రి బసకు ఏర్పాటు చేస్తున్నారు. అయితే గతంలో విశ్రాంతి తీసుకొనేందుకు ఎటువంటి సౌకర్యం లేకపోవడంతో శబరీ నది ఒడ్డునే సేద తీరాల్సి వచ్చేది. తగిన విద్యుత్ దీపాలు లేకపోవడం భక్తులు ఇబ్బందులు పడుతుండేవారు. దీనిని గుర్తించి, టెంట్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వెల్లడించారు. అలాగే అగర్వాల్ బంధు కావిడి సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు.

బరంపురంలో..

బరంపురం: శ్రావణమాసం భోల్‌భం దీక్షాధారులకు పవిత్రమైన రోజు కావడంతో సందడిగా మారింది. ఈ నేపథ్యంలో దీక్షకు కావాల్సిన సామగ్రి కొనుగోలు కోసం స్థానిక గిరి మార్కెట్, బాపు బజార్, కొమ్మాపల్లి, పెద్ద బజార్‌లో వందలాది మంది బారులు తీరారు. వీరంతా వివిధ నదుల నుంచి పవిత్ర జలాలను కావిడిలో కాలి నడకన మోసుకొని వెళ్లి, నగరంలోని వివిధ శివాలయాలకు చేరుకొని ప్రత్యేక అభిషేకాలు చేయనున్నారు.



గుప్తేశ్వర్ మార్గంలో భోల్‌భం భక్తుల సందడి



గుప్తేశ్వర్‌లో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన టెంట్లు



:కాలినడకన యాత్ర ప్రారంభించిన భక్తులు

క్లుప్తంగా

శ్రామికుల ప్రయోజనాలే ప్రధానం

● పీఎఫ్ రీజనల్ కమిషనర్ పీఎన్ సింగ్



మాట్లాడుతున్న రీజనల్ కమిషనర్ సింగ్

జయపురం: శ్రామికుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని పీఎఫ్ బరంపురం రీజనల్ కమిషనర్ పీఎన్ సింగ్ తెలిపారు. జయపురంలో క్యాజూ మిల్లు సంఘం ఆధ్వర్యంలో జనసునానీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న శ్రామికులను భవిష్యత్ నిధి(పీఎఫ్) పథకంలో చేర్చేందుకు యాజమాన్యాలు ముందుకు రావాలని సూచించారు. దీనికి అనుగుణంగా కార్మికుల జాబితాను అందించాలన్నారు. వారందరికీ సామాజిక సురక్ష కల్పించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జయపురం సేవా పేపరుమిల్లు కార్మిక నాయకులు కమిషనర్‌ను కలిసి, పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలోకమిషనర్ కార్యాలయ అధికారి పీకే మహరాణ, సుశాంత నాయక్, ధీరేంద్ర దొళాయి, సేవా నాయకులు జయంతి శాంత, ప్రమోద్‌కుమార్ మహంతి, బసంత బెహరా, సందీప్ పటానాయక్, సరోజ్ సువార్, నర్సింగ మహాపాత్రో, అజయ భలొ, సుధాకర హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తవలో కలెక్టర్ పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ కాశీనగర్ సమితి బూదర పంచాయతీ బత్తవ గ్రామంలో ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల తరగతి గదులను పరిశీలించి, అక్కడి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మో ఘెరో(నా ఇల్లు) పథకం అమలుపై, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇటీవల బదిలీ అయిన వేలాదిమంది ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం బాధాకరమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు వారాల క్రితం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్పందన కార్యక్రమంలో బదిలీల్లో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశామని, ఇంతవరకు స్పందన లేదన్నారు. కొన్ని ఫిర్యాదులకు జిల్లా విద్యాశాఖ అధికారి అసంబద్ధమైన సమాధానాలు ఇచ్చారని, వాటిని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నెల జీతాలపై ఆధారపడిన వేతనజీవులను బాధపెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా బదిలీల అనంతరం చేయాల్సిన రీఅపోర్షన్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, డిప్యూటీ డైరెక్టర్ జిల్లా ట్రెజరీ అధికారికి రీఅపోర్షన్ డాటా సమర్పించాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పడాల తమ్మినాయుడు, తేజేశ్వరరావు, ఎస్వీ రమణమూర్తి, రామారావు, శ్రీధర్, శ్రీను, రమణ, రాజు, సన్యాసిరావు, రమేష్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు



శ్రీకాకుళం కల్చరల్ : జిల్లా కేంద్రంలోని నక్కవీధిలో ఉమాజఠ లేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్ర పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి నారికేళజలంతో అభిషేకాలు జరిగాయి. అనంతరం రకరకాల పండ్లతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

మృత్యు ద్వారాలు!

● కటక్‌లో మురుగు కాలువలో జారిపడి యువకుడి మృతి
● అడుగడుగునా ఇదే తరహాలో దర్శనమిస్తున్న కాలువలు
● ఘటనపై మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు



మృతుడు రాహుల్

రాష్ట్రంలోని ప్రధాన నగర, పట్టణ ప్రాంతాల్లో పాలకసంస్థల నిర్లక్ష్యంతో పలువురు అమాయకుల ప్రాణాలు మురుగు కాలువల్లో కొట్టుకుపోతున్నాయి. నగర అభివృద్ధి, గృహనిర్మాణ విభాగం సమన్వయంతో నిర్వహించాల్సిన మురుగునీటి వ్యవస్థ కార్యాచరణ గాడి తప్పడంతో మూతలేని డ్రైనేజీల్లో జారి పడి, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ దయనీయ పరిస్థితులు ప్రధానంగా కటక్–భువనేశ్వర్ జంట నగరాల్లో తరచూ సంభవిస్తున్నాయి. – భువనేశ్వర్



నగరంలో మురుగునీటి కాలువల దయనీయ పరిస్థితి

కటక్ నగరం జోలా సాహి వద్ద బహిరంగ కాలువలో పడి 21 ఏళ్ల యువకుడు మరణించాడు. ఈ విచారకర సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు రాజస్థాన్‌కు చెందిన రాహుల్‌గా గుర్తించారు. ఇక్కడే తన బంధువుల వద్ద ఉంటుండగా, టీ దుకాణానికి వెళ్తూ ప్రమాదాశాత్తు కాలువలో జారిపడి పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కుండపోత వర్షాలు కారణంగా అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పైకప్పు లేని మురుగు కాలువలో ఈ యువకుడు జారడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మృతుడి తండ్రి స్థానిక పూరీఘాట్ ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు పట్టిన దుస్థితి మరో తండ్రికి పట్టకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో ప్రాధేయ పడ్డాడు. ఇటువంటి విచారకర ఘటనలు పునరావృతం కాకుండా సత్వర చర్యలు చేపట్టాలని కోరాడు.

ముందే స్పందించి ఉంటే..

బాక్స్ డ్రెయిన్ల గురించి చాలా కాలంగా వింటున్నా.. వాస్తవ కార్యాచరణ కనుసన్నల్లో లేకుండా పోతుంది. వర్షం కురిస్తే కృత్రిమ వరదలు పొంగిపొర్లి, ఊహాతీతమైన అవాంఛనీయ పరిస్థితులను ప్రేరేపిస్తున్నాయి. నగరం అంతటా మురుగునీటి కాలువలపై జనసందోహ ప్రాంతాల్లో పైకప్పు వేయాలని డిమాండ్ వినిపిస్తోంది. ఫాని తుఫాన్ సమయంలో ఘటనా స్థలంలో మురుగునీటి కాలువ తెగిపోయింది. దీని పునరుద్ధరణ కోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు పలుమార్లు తెలియజేసిన ప్రయోజనం లేకపోయింది. ఇదే యువకుడిని పొట్టన బెట్టుకుందని స్థానిక కార్పొరేటర్ గగన్ ఓఝా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విచారకర ఘటనకు రాష్ట్రప్రభుత్వం, కటక్ నగరపాలక సంస్థ కారణమని ఆరోపించారు. పునరుద్ధరణ పనుల కోసం రూ.కోటి 40 లక్షల వ్యయ ప్రణాళిక సిద్ధం చేసినా, పనులు మాత్రం చేపట్టక పోవడంతో ఈ దయనీయ పరిస్థితి చోటు చేసుకుందని విమర్శించారు. ఈ ఏడాది మేలో స్థానిక పూరీఘాట్ పోలీసు ఠాణా పరిధి కేసర్‌పూర్‌లోని గమాడియా ప్రాంతంలో దశాబ్దాల నాటి ఇనుప వంతెన కూలిపోవడంతో 13 ఏళ్ల బాలిక తీవ్ర గాయాలకు గురై ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కటక్ మున్సిపల్ కార్పొరేషన్ నగర అభివృద్ధి, గృహనిర్మాణ విభాగానికి చెందిన ఇద్దరు సహాయ ఇంజినీర్లను విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఆరోపణ కింద సస్పెండ్ చేయడంతో కటక్ నగరపాలక సంస్థ చేతులు దులిపేసుకోవడంతో స్వల్పకాలంలో మరో విచారకర ఘటన పునరావృతమైంది.



కటక్‌లో యువకుడిని బలిగొన్న పైకప్పు లేని మురుగు కాలువ

నగరంలో అడుగడుగునా..

రాజధాని నగరం స్మార్ట్ సిటీగా వెలుగొందుతోందని అధికార పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నా.. చినుకు పడితే మొత్తం చిత్తడిగా మారుతోంది. నగర వ్యాప్తంగా మురుగునీరు చకచకా ప్రవహించేందుకు అనుకూల పరిస్థితులు లేక జల దిగ్బంధం అవుతోంది. మరోవైపు జనసందోహిత ప్రాంతాల్లో మొక్కుబడిగా ఉన్న మురుగునీటి కాలువలపై మూతలు లేదా కప్పులు వేయక పోవడంతో ప్రాణాపాయ పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఇటువంటి మురుగునీటి కాల్వలు మృత్యు ముఖ ద్వారాలుగా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నగరంలో పాతబస్తీ, చంద్రశేఖరపూర్, యూనిట్–8, లక్ష్మీసాగర్, శైలశ్రీ విహార్, ఖండగిరి, 50, 51, 63 వార్డుల్లో ఇటువంటి ప్రాణాంతక డ్రైనేజీలు అడుగడుగున తారస పడుతున్నాయి. స్థానిక సమస్యల పట్ల మున్సిపల్ కార్పొరేటర్ల మొర అరణ్య రోదనగా నిర్వీర్యం అవుతుందని ఆరోపిస్తున్నారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్‌టోర్నీ విజేత పూరీ



బహుమతులు అందజేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో ఐసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న భానుమతి నరసింగరావు మెమోరియల్ అంతర్‌రాష్ట్ర సీజన్ -1 టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. విజేతగా పూరీ జట్టు నిలిచింది. ఒడిశాకు చెందిన బరంపురం లీడ్స్, పూరీ జట్లు ఫైనల్‌లో ఆదివారం తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పూరీ జట్టు నిర్ణీత 14.4 ఓవర్లలో 119 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బరంపురం లీడ్స్ జట్టు 15 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. దీంతో పది పరుగుల తేడాతో పూరీ జట్టు విజేతగా నిలిచింది.

విన్నర్‌గా నిలిచిన పూరీ జట్టుకు రూ. 22,222, రన్నరప్‌గా నిలిచిన బరంపురం లీడ్స్ జట్టుకు రూ. 16,666ప్రైజ్‌మనీ, షీల్డ్‌లతో సత్కరించారు. మ్యాన్‌ఆఫ్ ద సిరీస్‌గా సునీల్ పాణిగ్రాహి (బరంపురం లీడ్స్), బెస్ట్‌బౌలర్‌గా సంతోష్ మిశ్రా (బరంపురం లీడ్స్), బెస్ట్ బ్యాట్సమెన్‌గా సునీల్ పాణిగ్రాహి (బరంపురంలీడ్స్), బెస్ట్ ఫీల్డర్‌గా చిన్ను (కవిటి) ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమంలో భానుమతి నరసింగరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -1 అధ్యక్షుడు సామినేని గోపాల్, స్పాన్సర్స్ నర్తు శేశగిరిరావు, వెచ్చా కేశవరావు, ఉప్పాడ ఆనంద్, స్థానిక వైద్యులు డాక్టర్ ఉలాల శేషుయాదవ్, ఐసీసీ జట్టు అధ్యక్షుడు దాసరి రాజు పాల్గొన్నారు.

జ్యోత్స్న.. ది బెస్ట్ లిఫ్టర్



దేశ రాజధాని ఢిల్లీలోని గ్రేటర్ నొయిడాలో జరగుతున్న కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో రాష్ట్రానికి చెందిన జ్యోత్స్న సబర్ ది బెస్ట్ లిఫ్టర్‌గా టైటిల్ సాధించింది. యువజన వర్గంలో ఆమెకి ఈ విజయం వరించింది. జ్యోత్స్న విజయం.. రాష్ట్ర క్రీడా రంగానికి కొత్త వన్నె దిద్దుతుందని క్రీడాభిమానులు, అధికారులు, తోటి క్రీడాకారులు అభినందించారు. – భువనేశ్వర్

స్టేట్ ఓపెన్ చెస్ చాంపియన్‌గా సాత్విక్

● ముగిసిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు
● విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావు



మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు, నిర్వాహకులు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కోనసీమకు చెందిన డీఎస్ఎస్ఎస్‌యూ సాత్విక్ రాష్ట్ర ఓపెన్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా కార్తికేయ స్పోర్ట్స్ అకాడమీ, సీఎస్ఎన్ ట్రస్ట్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, శ్రీకాకుళం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఏపీ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు (జననాయక్ చౌదరి సత్యనారాయణ ట్రోఫీ) ఆదివారంతో ముగిశాయి. హోరాహోరిగా సాగిన ఈ పోటీల్లో ఓపెన్ విభాగంలో 7 రౌండ్లకుగాను సాత్విక్ 6.5 పాయింట్లను సాధించి విజేతగా నిలిచాడు. అనకాపల్లికి చెందిన బి.సాకేత్ రన్నరప్‌గా నిలిచాడు. విశాఖపట్నంకు చెందిన ముమ్మాడ వెంకట రుత్విక్ మూడోస్థానం, విశాఖకు చెందిన ఎస్.వరహాలు నాలుగో స్థానం, శ్రీకాకుళంకు చెందిన కుప్పిలి సాయివెంకట్ ఐదో స్థానంలో నిలిచారు. ఓపెన్ విభాగంలో 20 మందికి, వివిధ విభాగాల్లో చిన్నారులకు కలిపి రూ.52వేల నగదు బహుమతులు, ప్రసంశాపత్రాలు, పతకాలు, మెమెంటోలు అందజేశారు.

చెస్‌తో మేధస్సుకు పదును: మంత్రి ధర్మాన

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు చెస్ క్రీడతో మేధస్సు పెరుగుతుందన్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సనపల భీమారావు రెండు రోజుల చెస్‌మీట్ వివరాలను, ఏర్పాట్లను వివరించారు. ఆగస్టులో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర అండర్–11 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, టోర్నమెంట్ డైరెక్టర్ చౌదరి సతీష్, వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు బి.అజంత, కామేశ్వరి, న్యూసెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, చౌదరి అవినాష్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్, వైఎస్వీ కుమార్, బగ్గు అభినవ్, చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, ఆర్బిటర్లు నరేష్, నాయక్, చలపతిరావు, టెక్నికల్ సిబ్బంది, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘అక్షయపాత్ర’కు ఐఎస్ఓ గుర్తింపు



అక్షయ పాత్ర నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వంటశాలకు (ఐఎస్ఓ 2200–2018) గుర్తింపు లభించిందని ఆపరేషన్స్ మేనేజర్ పి.వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా శ్రీకాకుళం, గార, ఆమదాలవలస మండలాల్లోని 309 ప్రభుత్వ పాఠశాలలకు ఇక్కడి నుంచే భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. వంట, నిల్వ, పరికరాలు నిర్వహణ, భోజన రవాణా, శుచి, శుభ్రతతో కూడిన విధానంతో గుర్తింపు వచ్చినట్లు పేర్కొన్నారు. భగవంతుని ఆశీర్వాదం వల్ల గుర్తింపు వచ్చిందని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ భక్త దాసు తెలిపారు.

మర్యాద పూర్వకంగా..



ఉప రాష్ట్రపతి ధన్‌కడ్‌తో గవర్నర్ గణేషీలాల్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ ఢిల్లీలో భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను అందజేశారు. అలాగే వివిధ అంశాలపై చర్చించినట్లు గవర్నర్ కార్యాలయం వెల్లడించింది.

భోజనానికి ఇంటికి వెళ్తుండగా..

● టాటామ్యాక్సీ ఢీకొని వ్యక్తి మృతి
● మరొకరికి గాయాలు



లచ్చయ్య గ్రామ కూడలి వద్ద మృతదేహం

బూర్జ:

భోజనం చేసేందుకు సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న మామాఅల్లుళ్లను టాటామ్యాక్సీ క్యాబ్ ఢీకొట్టింది. ఈ ఘటనలో మామ మృతిచెందగా, అల్లుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ మండలం లచ్చయ్యపేటకు చెందిన సీర సన్యాసిరావు (62) అల్లుడు కొంచాడ రమేష్‌తో కలిసి కొల్లివలస, లచ్చయ్యపేట గ్రామాల సమీపంలో కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సైకిల్‌పై ఇద్దరూ ఇంటికి వెళ్తుండగా..పాలకొండ వైపు నుంచి వస్తున్న క్యాబ్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సైకిల్ వెనుక కూర్చున్న సన్యాసిరావు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సైకిల్ తొక్కుతున్న రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సన్యాసిరావుకు భార్య లచ్చమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివసాగర్ బీచ్‌లో యువకుడు గల్లంతు



కొండె నవీన్ (ఫైల్)


వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం యువకుడు గల్లంతైన విషాద సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, తోటి స్నేహితులు తెలిపిన వివరాల మేరకు.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామానికి చెందిన కొండె నవీన్(23) స్నేహితులతో కలిసి శివసాగర్ బీచ్‌కు వచ్చాడు. సరదాగా కాసేపు తీరంలో గడిపి సముద్రంలో స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా భారీ అల రావడంతో కొట్టుకుపోయాడు. స్నేహితులంతా తీరానికి చేరుకున్నా నవీన్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడి ఆచూకి కోసం గాలిస్తున్నట్లు ఏఎస్సై జిన్నారావు తెలిపారు. కాగా, నవీన్ డిగ్రీ పూర్తిచేసి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఉద్యోగం చేసి అండగా నిలుస్తాడన్న ఒక్కగానొక్క కుమారుడు గల్లంతు కావడంతో తల్లిదండ్రులు నాగరాజు, చామంతి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

● ఉధృతంగా మహేంద్ర తనయ

ఒడిశాలో ఇటీవల పడిన వర్షాలకు మహేంద్ర తనయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం పాతపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో సింగుపురం, లాబర, కొరసవాడ, బోరుబద్ర, కాగువాడ, పెద్దలోగిడి, చిన్నమల్లిపురం గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు వరి వెదలు చిగురిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. - పాతపట్నం



సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం



మాట్లాడుతున్న వీజీకే మూర్తి

శ్రీకాకుళం అర్బన్: సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని గరిమెళ్ల విజ్ఞానకేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి, పోస్టల్ సంఘ ప్రతినిధులు అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, అనుబంధ సంఘాలైన ఏఐపీఈయూ–గ్రూప్–సి, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ అండ్ జీడీఎస్ అనుబంధ సంఘాల ద్వైవార్షిక మహాసభలు శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించారు. గ్రూప్–సి సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇ.శంకర్‌నాయుడు, బి.శ్రీధర్‌బాబు, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామానందం, జీడీఎస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్–సి సంఘాల గుర్తింపు రద్దు చేసిందని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిబ్బందిపై వేధింపులు ఆపాలన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో ఏఐపీఈయూ–గ్రూప్–సి అధ్యక్ష, కార్యదర్శులుగా యు.వి.రమణ, కె.గణపతి, పోస్ట్‌మేన్ అండ్ ఎంటీఎస్ అధ్యక్ష కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు, ఎల్.బాబూరావు, జీడీఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.ఎస్.ఆర్.మూర్తినాయుడు, ఎస్.నందికేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రానైట్ క్వారీలో పేలిన కంప్రెషర్

● బీహార్‌కు చెందిన వ్యక్తి మృతి
● మరో ముగ్గురికి గాయాలు



మృతిచెందిన భూషణ్‌దాస్

టెక్కలి రూరల్: టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ మేలిసతివాడ గ్రామ సమీపంలో ఉన్న సీహెచ్.రావు క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బీహార్‌కు చెందిన కార్మికులు క్వారీలో గ్రానైట్ రాళ్లను డ్రిల్లింగ్ చేస్తుండగా అక్కడే ఉన్న ఎయిర్ కంప్రెషర్ మిషన్ ఒక్కసారిగా పేలిపోయింది. పేలుడు ధాటికి అక్కడికి సమీపంలో మిషన్ ఆపరేటింగ్ చేస్తున్న బీహార్ రాష్ట్రం వెస్ట్‌చంపారన్ జిల్లాకు చెందిన భూషణ్‌దాస్(53) తుళ్లిపడటంతో మెడకు తీవ్ర గాయమైంది. బోల కుమార్, ద్రూప్ శాని, రోషన్‌కుమార్‌లపైకి ఆయిల్ తుళ్లిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను క్వారీ వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన భూషణ్‌దాస్ మృతిచెందాడు. మిగిలిన ముగ్గురూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు క్వారీ యాజమాన్య ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు.

న్యూస్‌రీల్

కోసలి సమీపంలో ఏనుగుల హల్‌చల్



ఐలమ్మ తోట నుండి పంట పొలాల్లోకి వస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని కోసలి సమీపంలో నాలుగు ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. ఆదివారం తాలాడ ఐలమ్మ తోట నుంచి బయటకు వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాల్లో షికార్లు కొట్టాయి. తోటలోని పండ్ల సీజన్ ముగియడంతో తోట బయటకు వచ్చి పంట చేలపై పడ్డాయి. మొక్కజొన్న, చెరకు, కర్బూజ ఇతర కూరగాయల పంటల కోతలు పూర్తవడంతో ఏనుగుల గుంపు ఆహారం కోసం పచార్లు కొట్టాయి. ఇదే సమయంలో నాట్లు వేసిన పంట పొలాలను పాడు చేశాయని కోసలి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



ఎల్విన్‌పేటలో కురుస్తున్న భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు కురిసిన వర్షంతో పొలాల్లో నీరు పుష్కలంగా చేరింది. రహదారులన్నీ జలమయం కావటంతో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే వరి విత్తనాలు వేయడంతో పెరిగిన నారుకు.. అలాగే దుక్కిలు చేపట్టేందుకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబులెన్సులను అప్రమత్తంగా నడపాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగ్గరాజు

విజయనగరం ఫోర్ట్: 104, 108 అంబులెన్సులను, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అత్యంత అప్రమత్తంగా నడపాలని ఆ వాహనాల అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయా వాహనాల డ్రైవర్లు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లకు ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల సామర్థ్యాన్ని ప్రతి రోజు పరిశీలించాలని సూచించారు. వాహనాల నిర్వాహణకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. 108 అంబులెన్సు ద్వారా రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడాలన్నారు. 104 వాహనాలను గ్రామాలకు నిర్దేశిత సమయానికి చేర్చాలని చెప్పారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వారిని సురక్షితంగా చేర్చాలన్నారు. శిక్షణలో 108 జిల్లా మేనేజర్ ఎస్.మన్మధనాయుడు, 104 జిల్లా మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముఖ, సంతోష్‌కుమార్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవుల మృతి



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఒక ఆవు

కొమరాడ: మండలంలోని జంఝావతి కుడి కాలువ పనులు డంగభద్ర సమీపంలో విద్యుత్ షాక్ తగిలి రెండు ఆవులు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో కాలువల్లో మట్టిని సుమారు 50 అడుగుల వరకు ఎత్తుగా పోయడంతో విక్రంపురం నుంచి డంగభద్ర వైపు వెళ్లే విద్యుత్ తీగలు తగిలి విక్రంపురం గ్రామానికి చెందిన పువ్వి పకీరు, పువ్వి బాబురావులకు చెందిన ఆవులు మేతకు వెళ్లి విద్యుత్ తీగలు తగలి మృతి చెందాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే మూగజీవాలు మృతి చెందాయని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ధ్వజమెత్తారు. కాలువ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కాలువపై విద్యుత్ తీగలు వద్ద మట్టి దిమ్మలు తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్

గంట్యాడ: మండలంలోని రామవరం వద్ద ప్రయాణికుల ఆటోను టిప్పర్ ఢీకొనడంతో ఆరుగురు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామానికి ఆరుగురు వ్యక్తులు ఒడిశా రాష్ట్రంలోని రాయగం వెళ్లేందుకు శనివారం రాత్రి 11గంటలసమయంలో ఆటోలో బయలుదేరి వెళ్తుండగా రామవరం పెట్రోల్ బంక్ వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయాల పాలయ్యారు. వెంటనే క్షతగాత్రులను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఆటోడ్రైవర్ సైలాడ రమణ పరిస్థితి రమణ పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

మన్యంలో మధుర ఫలాలు



సీతంపేట మార్కెట్‌కు సీతాఫలాలు తీసుకువస్తున్న మహిళ

మన్యంలో పండే మధుర ఫలాలు భలే రుచికరంగా ఉంటాయి. రుచిలో వీటికి సాటేవి రావు. ఇక్కడ సీతాఫలాలకు మంచి డిమాండ్ కూడా ఉంటుంది. అయితే సాగు చేసే వారి కంటే మైదాన ప్రాంతాలకు తెచ్చి విక్రయించే వారికి మంచి లాభాలు సమకూరుతున్నాయి.

- సీతాఫలాల సీజన్ ఆరంభం
- జిల్లాలో 3 వేల ఎకరాల్లో పంట సాగు
- 4 వేల టన్నుల వరకు దిగుబడి
- కావిడ ధర రూ.1500ల పైనే..
- మైదాన ప్రాంతాల్లో డిమాండ్

సీతంపేట: మధుర ఫలాలుగా పిలవబడే సీతాఫలాల సీజన్ మన్యంలో ఆరంభమైంది. ఈ ఏడాది దిగుబడులు అధికంగా ఉంటాయని గిరిజనులు ఆశాభాం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మద్దతు ధరలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. సీతంపేట మార్కెట్లోకి సీతాఫలాలు గిరిజన రైతులు ఆదివారం తీసుకువచ్చారు. కావిడ సీతాఫలాలు రూ.1500ల వరకు విక్రయించారు. గతేడాది రూ.1000 – 1200ల మధ్య అమ్మకాలు జరిపామని గిరిజనులు తెలిపారు. ఇప్పుడు ప్రారంభమైన సీజన్ సెప్టెంబర్‌తో ముగుస్తుంది. గిరిజనులకు పైనాపిల్ తర్వాత అత్యధిక ఆదాయాన్ని తెచ్చే పంట ఇది. ఒడిశా, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేస్తారు. ఆయా ప్రాంతాల్లో వారు కిలోల వంతున విక్రయించి లాభాలు ఆర్జిస్తారు. ఇక్కడ కిలో సరాసరి రూ.20 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు మైదాన ప్రాంతాల్లో రూ.100 నుంచి 150 వరకు విక్రయిస్తారు. కొంత మంది సీజన్ ఆరంభంలోనే గ్రామాల్లోకి వెళ్లి అడ్వాన్సులు ఇచ్చి కొనుగోలు చేస్తారు.



వ్యాపారులు క్రయవిక్రయాలు చేస్తున్న సీతాఫలాలు

3 వేల ఎకరాల్లో పంట సాగు

సీతంపేట, భామిని, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో కొండపోడు వ్యవసాయంలో భాగంగా దాదాపు 3 వేల ఎకరాల్లో సీతాఫలం పంట సాగవుతుంది. కొండపోడు వ్యవసాయంలో అక్కడక్కడ సీతాఫలం చెట్లు విస్తరించి ఉంటాయి. సుమారు 4 వేల టన్నుల వరకు దిగబడి వస్తుంది. ఖరీఫ్ సీజన్లో వరిలో పెట్టుబడులు పెట్టడానికి ఈ పంట ఎంతో దోహద పడుతుందని గిరిజనులు చెబుతున్నారు. గతేడాది మొదట్లో ఇదే ధరలు ఉన్నప్పటికీ మధ్యలో ధరలు తగ్గిపోయాయి. గిరిజనులు నిల్వ చేసుకోవడానికి వీలుకాని పండ్ల జాతిలో సీతాఫలం ఒకటి. చెట్టు నుంచి రెండు, మూడు రోజుల్లో విక్రయించకపోతే పండు కుళ్లిపోతుంది. సోమవారం సీతంపేట, బుధవారం మర్రిపాడు, శనివారం పొల్ల, కుశిమి, గురువారం దోనుబాయిలలో జరిగే వారపు సంతల్లో వీటిని విక్రయిస్తారు.

సీజన్ ఆరంభమైంది



సీజన్ ఆరంభమైంది. నాకు ఎకరా కొండపోడు వ్యవసాయం ఉంది. అక్కడక్కడ 15 వరకు సీతాఫలం చెట్లు ఉన్నాయి. బాగా కాపుకు రావడంతో విక్రయించడానికి సీతంపేట తీసుకువచ్చాను. కావిడ రూ.1500లకు విక్రయించడం జరిగింది. గతేడాది కూడా ఇలాగే విక్రయాలు జరిపాను. రూ.15 వేల వరకు ఆదాయం వచ్చింది.

– సవర ఆనంద్, అబలాసింగి

నిల్వ ఉండవు



సీజన్ ఆరంభంలో సరైన ధరలు పలుకుతాయి. మధ్యలో ధరలు పడిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ఈ పండ్లు రెండు మూడు రోజుల కంటే ఎక్కువగా నిల్వలు ఉండవు. నిల్వ ఉంచితే పోతాయి. ఎప్పుడు సీతాఫలం అప్పుడు విక్రయించాల్సి ఉంటుంది.

– ఎస్.సురేష్, లోవగూడ

కళ్ల కలవరం



- కలకలు ఉంటే వైద్యుని సంప్రదించడం మేలు
- జిల్లాలో గడిచిన మూడు రోజుల్లో నగటున 300 మందికి కలకలు
- వాతావరణ మార్పులతో మరింత వ్యాప్తి
- జాగ్రత్తలు పాటిస్తే సరి..: వైద్యులు

పార్వతీపురం టౌన్: వాతావరణ పరిస్థితులు మారిన క్రమంలో సీజనల్ వ్యాధులతో పాటు కళ్ల కలకలు కలవరపెడుతున్నాయి. మన్యం జిల్లాలో గడిచిన మూడు రోజులుగా సగటున 300 మందికి కలకలు నమోదవుతున్నాయి. ప్రమాదకరం కాకున్నా అంటు వ్యాధి కావడంతో సోకిన మూడు నాలుగు రోజులు అవస్థలు తప్పవు. కళ్ల వాపు, ఎరుపెక్కి.. కళ్లల్లో ఇసుక వేసినట్టు తీవ్రమైన మంటగా ఉండడం దీని ప్రధాన లక్షణం. అడినో అనే వైరస్ వల్లే ఇది వ్యాప్తి చెందుతుంది. రుతువులు మారే రోజుల్లో సాధారణంగా వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగి, వేడిగాలులు వీచే సమయంలో, శీతాకాలంలో ఎక్కువగా ఇది ప్రబలుతుంది. దీన్ని 'పింక్ ఐ'గా కూడా పిలుస్తారు. వాతావరణంలో దుమ్ము, ధూళి వల్ల అతి సులభంగా అలర్జీ ఏర్పడుతుంది. దీంతో కళ్లకు జిల వస్తుంది. రుద్దితే కళ్లు ఎర్రగా మారి వాచిపోతాయి. కళ్లల్లో కొన్నిసార్లు నీరు కారుతూనే ఉంటుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే కళ్ల నుంచి చీము వంటి ద్రవం కూడా కారుతుంది. నిద్ర లేచినప్పుడు కళ్లు తెరవలేని పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రత ఎక్కువగా ఉంటే కంటి వైద్యులను సంప్రదించడం మేలు.

వైఎస్సార్ కంటి వెలుగుతో అవగాహన

జిల్లాలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉండడంతో మూఢనమ్మకాలు, నాటువైద్యం చేయించుకుని మరింత అస్వస్థతకు గురవుతుండడంతో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంతో గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. గడిచిన మూడు రోజులుగా సగటున రోజుకు 300 వరకు కేసులు నమోదవుతున్నట్టు వైఎస్సార్ కంటి వెలుగు నేత్ర వైద్యాధికారులు చెబుతున్నారు.

సులభంగా నియంత్రణ

నేరుగా కళ్లతో చూస్తే ఈ వ్యాధి అంటుకోదు. చేతులను తాకటం ద్వారా సోకుతుంది. కనుక తరచూ చేతులను సబ్బుతో కడగడం మంచిది. టిష్యూ పేపర్‌ను ఉపయోగించడం శ్రేయస్కరం. ఇతరులకు సోకకుండా ఉండేందుకు కళ్లకు నల్లటి అద్దాలను ధరిస్తే మంచిది. అప్పుడప్పుడు చల్లటి నీటితో కళ్లను శుభ్రపరచాలి. వైద్యుల సూచన మేరకు ఐ డ్రాప్స్ వేస్తే మంచిది.

ఆందోళన అక్కర్లేదు...



కళ్లను చల్లటి మంచి నీటితో శుభ్రపరచాలి. మెత్తటి చేతి రుమాలుతో కళ్లు తుడుచుకోవాలి. వైద్యుల సూచనల మేరకు సిప్లాక్స్, లూబ్రికేటెడ్ ఐ డ్రాప్స్ వాడితే సరిపోతుంది. యాంటీ బయాటిక్ చుక్కల మందును గంటకు ఒకసారి రెండు చుక్కలు వేసుకోవాలి. ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– డాక్టర్ నగేష్‌రెడ్డి, వైఎస్సార్ కంటి వెలుగు వైద్యాధికారి, పార్వతీపురం మన్యం

జన సంచారంలో తిరగొద్దు..



కళ్ల కలకలు వచ్చిన వారు ఎక్కువగా జన సంచారంలో తిరగకూడదు. మిగిలిన వారికి కూడా ప్రబలే అవకాశం ఉంది. కళ్ల పరిశుభ్రత పాటించాలి. ఐదు రోజుల్లో తగ్గకుంటే వైద్య నిపుణులను సంప్రదించాలి.

– డాక్టర్ బి.జగన్నాథరావు, డీఎంహెచ్‌వో, పార్వతీపురం మన్యం

పరారైన నిందితుడిని పట్టుకున్న ఆర్‌పీఎఫ్



నిందితుడు రాణాను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

విజయనగరం క్రైమ్: హత్య కేసులో పరారైన నిందితుడ్ని విజయనగరం ఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని బలంగీర్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడు మిలాన్ రాణా ఒడిశా నుంచి పరారై టాటా యశ్వంత్ పూర్ రైలు ఎక్కేశాడు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన పోలీసులు వెంటనే విశాఖ ఆర్‌పీఎఫ్ కమిషనర్‌కు ఫోన్‌చేశారు. అక్కడి నుంచి విజయనగరం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కు సమాచారం వచ్చింది. ఈ సమాచారం మేరకు అప్రమత్తమైన ఆర్‌పీఎఫ్ సిబ్బంది యశ్వంత్‌పూర్ రైలు విజయనగరం స్టేషన్‌కు చేరుకున్న సమయంలో తనిఖీలు నిర్వహించి ఎస్–2 కోచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు రాణాను పట్టుకుని, అరెస్టు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ అఖిలేష్ కుమార్ సమక్షంలో బలంగీర్ పోలీసులకు అప్పగించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బికెవి.ప్రసాదరావు అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆది వారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్త కొరతను తీర్చడానికి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన పెరగాలన్నారు. మనిషి మాత్రమే రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడని, దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాది కి నాలుగు పర్యాయాలు రక్తదానం చేయవచ్చు నని తెలిపారు.

తిప్పలవలసలో ముందుకొచ్చిన సముద్రం



సురక్షిత ప్రాంతానికి తరలించిన పడవలు, వలలు

పూసపాటిరేగ : మండలంలోని తిప్పలవలస సము ద్ర తీరంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో 15 అడుగులు సముద్రం ముందుకు వచ్చింది. ఉవ్వెత్తిన లేచిన కెరటాలు ఉధృతితో సముద్రం ముందుకు వచ్చింది. హఠాత్తుగా సము ద్ర కెరటాలు ఉవ్వెత్తిన లేచి ముందుకు రావడంతో తేరుకున్న మత్స్యకారులు తీరం అంచున ఉన్న పడ వలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సముద్రంలో వాతావరణంలో తేడా కారణంగా కెరటాలు ముందుకు వచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు.

ముగిసిన పవర్‌లిఫ్టింగ్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



క్లాసిక్‌పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొన్న మహిళలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: గడిచిన ఐదు రోజులుగా స్థానిక జీఎంఆర్ స్పోర్ట్స్ అరేనాలో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్స్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 22 రాష్ట్రాల నుంచి పాల్గొన్న సుమారు 300 మంది స్త్రీ, పురుషులు బరువు, వయసు ఆధారంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఇండియా పవర్‌లిఫ్టింగ్ అధ్యక్షుడు కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజయం సాధించాలనే తపనతోనే పోటీలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. గెలుపోటములు సహజమని, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారని తెలిపారు. ఇక్కడ జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచిన వారంతా భవిష్యత్తులో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, ట్రోఫీలను పవర్ లిఫ్టింగ్ ఇండియా అధ్యక్షుడితోపాటు కార్యదర్శి పీజే జోసెఫ్, డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీ ఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఏపీ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, సౌతిండియా జోనల్ సెక్రటరీ కోటేశ్వరరావు, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, డాక్టర శశికుమార్ తదితరులు అందించారు.

ఓవరాల్ చాంపియన్‌గా మహారాష్ట్ర..

ఐదు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల రెండు విభాగాల్లో ఓవరాల్‌చాంపియన్‌గా మహారాష్ట్ర నిలిచిందని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఎక్విప్డ్ విభాగంలో 244 పాయింట్లతోను, క్లాసిక్ విభాగంలో 287 పాయింట్లతో ముందంజలో నిలిచి ఈ ఘనత సాధించిందని చెప్పారు. మధ్యప్రదేశ్ 153 పాయింట్లతో ద్వితీయ స్థానం, తమిళనాడు 152 పాయింట్లతో తృతీయ స్థానం సాధించాయని వెల్లడించారు.

ఆఖరి రోజు విజేతలు వీరే..

ఆఖరి రోజు నిర్వహించిన క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగాయి. 40, 50, 60, 70 సంవత్సరాల విభాగంలో టీం చాంపియన్‌షిప్, బెస్ట్ లిఫ్టర్స్, ఓవరాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు.

టీం ఛాంపియన్‌షిప్‌లో..

40 సంవత్సరాలకు సంబంధించి టీంచాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, స్త్రీల విభాగంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. 50 సంవత్సరాల పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, స్త్రీల విభాగంలో మహారాష్ట్ర, కేరళ, అస్సాంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. అలాగే 60 సంవత్సరాల పురుషుల విభాగంలో తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, స్త్రీల విభాగంలో మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరప్రదేశ్‌లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి. 70 సంవత్సరాల పురుషుల విభాగంలో మహారాష్ట్ర, కేరళ, తెలంగాణలు నిలిచాయి.

బెస్ట్ లిఫ్టర్స్ విభాగంలో..

40 సంవత్సరాల పురుషుల విభాగంలో పి.మయకృష్ణ (తమిళనాడు), వెంకటేష్ ప్రభు (కర్నాటక), అంకుష్‌గద్వే (మహారాష్ట్ర), స్త్రీల విభాగంలో డాక్టర్ శార్వారి ఇనమ్దా (మహారాష్ట్ర), నీతామెహతా (మహారాష్ట్ర), ఏక్తా విష్ణునోయ్ (ఢిల్లీ)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 50 సంవత్సరాల పురుషుల విభాగంలో బినోద్‌కుమార్ పత్రా (జార్ఖండ్), గంటా వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రదేశ్), కృష్ణచంద్రసాహు (ఒడిశా)లు, స్త్రీల విభాగంలో వినుతారఘునాథ్ (మహారాష్ట్ర), రుబీదాస్ (మహారాష్ట్ర), రంజిత మిశ్రా(మహారాష్ట్ర)లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే 60 సంవత్సరాల పురుషుల విభాగంలో ఎస్.జయరామన్ (తమిళనాడు), కె.విజయరంగన్ (తమిళనాడు), కాంతీలాల్ ధకలే (మహారాష్ట్ర)లు, స్త్రీల బిద్యపుకాన్ (అస్సాం), మీరా రజ్దాన్ (మధ్యప్రదేశ్), నమ్రతాగౌతమ్ (ఉత్తరప్రదేశ్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 70 సంవత్సరాల పురుషుల విభాగంలో పి.ప్రేమ్‌చంద్రన్ (కేరళ), దేవ్‌దత్ బోర్ (మహారాష్ట్ర), అశోక్‌దాస్ (పశ్చిమబెంగాల్)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.



అన్ని విభాగాల విజేతలతో నిర్వాహకులు

టెలి మెడిసిన్ సేవలు భళా..!

- వీడియో కాల్‌లో వ్యాధి చెబితే చికిత్స
- 2021 ఫిబ్రవరిలో సేవలు ప్రారంభం



కోట మండలం సీతంపేట హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నుంచి టెలిమెడిసిన్ హబ్‌కు వృద్ధుడి సమస్య వివరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ



వీడియోకాల్‌లో రోగి సమస్య తెలుసుకుంటున్న వైద్యులు

2021 ఫిబ్రవరి నుంచి 2023 జూన్ వరకు అందించిన సేవలు

సంవత్సరం	వీడియో కాల్ సేవలు
2021	1,40,208
2022	1,11,887
2023 జూన్‌నాటికి	22,685

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రికి రాకుండానే రోగి ఉన్న గ్రామం నుంచే స్పెషలిస్టు వైద్యుల సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన టెలిమెడిసిన్ హబ్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. నిత్యం అధిక సంఖ్యలో రోగులు టెలిమెడిసిన్ హబ్ సేవలు పొందుతున్నారు. ఉన్న గ్రామం నుంచే స్పెషలిస్టు వైద్య సేవలు లభిస్తుండడంతో అధిక సంఖ్యలో రోగులు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఘోషా ఆస్పత్రి ఆవరణలో టెలిమెడిసిన్ హబ్‌ను ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో ఏర్పాటు చేసి రోజుకు వందలాది మందికి సేవలు అందిస్తోంది.

స్పెషలిస్టు వైద్యుల విధి నిర్వహణ

టెలి మెడిసిన్ హబ్‌లో ఐదుగురు స్పెషలిస్ట్ వైద్యులు విధులు నిర్వర్తిస్తారు. వారిలో పిల్లల వైద్యుడు, గైనకాలజిస్టు, జనరల్ ఫిజీషియన్, ఎంబీబీఎస్ వైద్యులు ఇద్దరు విధులు ఉంటారు. టెలిహబ్‌లో రోగులు ఏ స్పెషాలిటీ వైద్య సేవలు కావాలని అడుగుతారో సంబంధిత వైద్యులు స్పందించి వారికి సమస్య తెలుసుకుని ఏ చికిత్స అందించాలో ఆన్‌లైన్‌లో తెలియజేస్తారు. దాని ఆధారంగా వైద్య సిబ్బందికి రోగులకు చికిత్స అందిస్తారు.

విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నుంచి వీడియో కాల్

విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే రోగులను అక్కడ ఉన్న ఎంఎల్ హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) ముందుగా పరీక్షిస్తుంది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు ఎంఎల్‌పీలు వైద్య సేవలు అందిస్తారు. స్పెషలిస్టు వైద్యులైన గైనిక్, జనరల్ ఫిజీషియన్, పిడియాట్రిక్ వైద్య సేవలు అవసరమైతే విలేజ్ హెల్త్ సెంటర్ నుంచి టెలిమెడిసిన్ హబ్‌కు వీడియో కాల్ చేస్తారు. రోగి తన సమస్యను వైద్యులకు చెబితే ఏం మందులు వాడాలో ఎంఎల్‌పీకి స్పెషలిస్టు వైద్యులు తెలియజేస్తారు. అదేవిధంగా పీహెచ్‌సీ, పట్టణ పీహెచ్‌సీ నుంచి కూడా టెలి మెడిసిన్ హబ్‌కు వీడియో కాల్ చేసి స్పెషలిస్టు వైద్యుల సేవలు పొందుతారు. టెలి మెడిసిన్ హబ్ ఏర్పాటైన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో తప్ప మిగతా సమస్యలకు టెలి మెడిసిన్ ద్వారా సేవలు పొందగలుగుతున్నారు. ఈసేవలు గ్రామీణ ప్రాంత రోగులతో పాటు, పట్టణ ప్రాంత రోగులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఉన్న చోట నుంచే సేవలు

టెలిమెడిసన్ హబ్‌కు మంచి స్పందన వస్తోంది. అనేక మంది ఈసేవలను వినియోగించుకుంటున్నారు. రోగులు ఉన్న ప్రాంతం నుంచే వైద్య సేవలు పొందగలుగుతున్నారు.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ